భక్తిశ్రద్ధలతో గణనాథులకు పూజలు

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిజాంపేట్, పేట్‌బషీరాబాద్, కేపీహెచ్‌బీ కాలనీ, చందానగర్, గచ్చిబౌలి, ఫతేనగర్, ఓల్డుబోయినపల్లి, బాలానగర్, హైదర్‌నగర్, జీడిమెట్ల ప్రాంతాల్లో కొలువైన వినాయక పండపాల్లో గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనలు చేశారు. కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ వద్ద నిమజ్జనాలను తిలకిస్తూ భక్తులు సందడి చేశారు. హస్మత్‌పేట బోయిన్ చెరువు వద్ద గణేశ్ నిమజ్జనాలను ప్రశాంతంగా చేశారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, వివిధ అసోసియేషన్లు, మండపాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

- నిజాంపేట్/ పేట్‌బషీరాబాద్/ కేపీహెచ్‌బీ కాలనీ/ చందానగర్/ గచ్చిబౌలి/ ఫతేనగర్/ ఓల్డుబోయినపల్లి/ బాలానగర్/ హైదర్‌నగర్/ జీడిమెట్ల, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి)



కేపీహెచ్‌బీలో టాకింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపయ్య మండపం వద్ద అన్నదాన కార్యక్రమంలో భోజనం వడ్డిస్తున్న సినీనటి అర్చన వేద, నిర్వాహకులు దుర్గాదేవి, గోపీనాథ్ యాదవ్ తదితరులు



ఫతేనగర్ గౌతమినగర్‌లో యువ నాయకుడు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి పూజల్లో పాల్గొన్న ఉద్యమ నాయకుడు గొట్టి పద్మారావు, తదితరులు

- నిజాంపేట జర్నలిస్టుకాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద కాలనీఅధ్యక్షుడు ఆస్కాని మారుతీ సాగర్, మాధవి దంపతులు అన్నదానం చేశారు.
- కుత్బుల్లాపూర్ గ్రామంలో వినాయక మండపం వద్ద ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌గౌడ్ అన్నదానం చేశారు. పేట్‌బషీరాబాద్‌లోని రంగారెడ్డినగర్‌లో వినాయక మండపంలో గణేశ్‌డికి మహిళలు పూజలు చేశారు.
- మూసాపేట్ ముష్కిపేట్‌లో శ్రీవినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ లంబోదరుడికి మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, కమిటీ సభ్యులు పూజలు చేశారు.
- కేపీహెచ్‌బీకాలనీ నాలుగో ఫేజ్‌లో బొజ్జ గణపయ్యకు బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్‌అరోరా, బాదర్ల భవాని, రాజేష్‌రాయ్, పాతూరి గోపీ, సాయిశ్రీనివాస్, కన్నలత, రమాదేవి, కృష్ణకుమారి తదితరులు పూజలు చేశారు.
- చందానగర్ శివాజీనగర్ ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో గణేశ్‌కు ఉరిటి వెంకట్రావ్ ప్రజాపతి పూజలు చేశారు.
- శేరిలింగంపల్లి అపర్ణా గ్రాండేలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గణేశ్ లడ్డూను వేలంపాటలో రూ.7.50లక్షలకు ఎఫ్‌బ్లాక్‌కు చెందిన మిలాన్ తదితరులు దక్కించుకున్నారు.
- ఓల్డుబోయినపల్లి డివిజన్ అంజయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలోని గణనాథుడికి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ పూజల్లో సీనియర్ నాయకుడు కర్రె జంగయ్య, యాదగిరి, ఉదయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.
- బాలానగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడికి కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో ఆయన సతీమణి మాధవీరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పూజలు చేశారు.
- ఫతేనగర్ డివిజన్ ఆల్విన్‌సొసైటీ, ఫతేనగర్ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడికి కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.
- భరత్‌నగర్ కాలనీ ఓం సాయిగణేష్ యూత్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన గణనాథుడికి కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, డివిజన్ నాయకులు కొండల్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకి, కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్, రాజుతో కలిసి ప్రత్యేకపూజలు నిర్వహించారు.
- ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట కౌండిన్య యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేశ్ మండపం వద్ద లడ్డూను వేలంపాటలో రూ.1.21లక్షలకు పట్నం మధుసూదన్‌రెడ్డి దక్కించుకున్నారు.
- జీడిమెట్ల ప్రాంతంలోని ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లో నిర్వహించిన వినాయక పూజల్లో మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకులు బొబ్బా రంగారావు, ప్రసాద్, లక్ష్మీనారాయణ, కూరపాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్: హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. కల్చరల్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ఆల్విన్‌కాలనీ ధరణినగర్, సాయినగర్, వెస్ట్‌కాలనీలోని గణపతి మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద భక్తుల సందడి

ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనాలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ (రంగధాముని చెరువు) వద్ద భక్తుల సందడి నెలకొంది. గణేశ్ నిమజ్జనం చేసే వారితోపాటు చూడటానికి వచ్చే భక్తజనంతో ఆ ప్రాంతం కళకళలాడింది. జైగణేశా.. బైబై గణేశా అంటూ నినదించారు.

● **ఓల్డుబోయినపల్లి:** ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట్ బోయిన్‌చెరువులో గణేశ్ విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా జరుగుతోంది. అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. నిమజ్జనం కోసం నీటికొలను వద్ద రెండు క్రేన్లను, మూడు షిఫ్టులలో (షిఫ్టుకు15 మంది) చొప్పున ఎంటమాలజీ, శానిటేషన్ సిబ్బందిని అధికారులు ఏర్పాటు చేశారు.

చెట్ల కొమ్మలను తొలగించాలి

కేపీహెచ్‌బీకాలనీ: గణేశ్ నిమజ్జనాలు ప్రారంభమైనా ఇంకా చెట్ల కొమ్మలు తొలగించలేదు. కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధుల్లో ఎక్కడ చూసినా కాలనీలు, బస్తీలతోపాటు ప్రధానరోడ్లలో సైతం చెట్ల కొమ్మలు కిందకు వేలాడుతున్నాయి. ఇంకా వాటిని తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తొమ్మిదోరోజు రానున్న నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించాలని గణేష్ మండపాల నిర్వాహకులు కోరుతున్నారు.

ఓపెన్ ఇంటర్ అడ్మిషన్స్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్, జిల్లా కో-ఆర్డినేట్ సత్యనారాయణ

దుండిగల్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ ఇంటర్ అడ్మిషన్స్ కోసం రూపొందించిన పోస్టర్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్, జిల్లా కో-ఆర్డినేట్ సత్యనారాయణ గురువారం కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ మాట్లాడుతూ ఓపెన్ ఇంటర్ కళాశాలలో చేరాలనుకున్న వారికి ఇది చక్కని అవకాశం అన్నారు. అడ్మిషన్స్ గడువు ఫైన్‌తో అక్టోబర్ 31 వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ ఉపేందర్, పరశురాములు, సత్యనారాయణ పాల్గొన్నారు. అడ్మిషన్స్ కోసం 9959910131 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

ఉపాధ్యాయులకు సన్మానం

దుండిగల్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బౌరంపేటలోని ప్రభుత్వపాఠశాలలో అక్కడి ఉపాధ్యాయులను స్థానిక కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తూ, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, యువతను అత్యున్నత శిఖరాలకు చేరవేస్తున్న గురువులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, 16వ వార్డు కమిటీ అధ్యక్షులు మన్నె శేఖర్, ఉన్నత ప్రభుత్వ, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

జీడిమెట్ల, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆరుమాసాలకు రూ.2,84,759 ఆదాయం వచ్చిందని ఈవో కృష్ణమాచార్యులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సభ్యులు విఠల్‌రావు, జి.సుధాకర్‌రావు, ఎం.ప్రభాకర్, బి.శ్రీనివాసు, ఎం.మల్లికార్జున్‌రెడ్డి, దేవాలయ అర్చకులు ఎం.రామాచార్యులు, ఎం.విజయ్‌కుమారాచార్యులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లోనే మెడికల్ కాలేజీ నిర్వహించాలి

జీడిమెట్ల, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి కేటాయించిన మెడికల్ కాలేజీని కుత్బుల్లాపూర్‌లోనే ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక నాయకులు మెడికల్ కాలేజీకి సరైన భవనం చూపించలేక పోవడంతో దానిని ఈసీఐఎల్‌లో నిర్వహిస్తున్నారని, ఇది అన్యాయమని పేర్కొన్నారు. అదేవిధంగా గతంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మంజూరైన గురుకుల వసతిగృహం కూడా కుత్బుల్లాపూర్ నుంచి వెళ్లిపోయిందని, ఇది స్థానిక ప్రజాప్రతినిధుల వైఫల్యమని సీపీఐ కార్యదర్శి ఉమామహేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హరనాథ్, ప్రవీణ్‌బాబు, భాస్కర్, సదానంద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): చెట్ల కొమ్మలను తొలగించే పనుల కారణంగా కొంపల్లి సబ్-స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శుక్రవారం విద్యుత్ ఉండదని ఏఈ వినాయక్ రాథోడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెన్‌సాయి, ఎన్‌సీఎల్, జీడిమెట్ల, జీబీఆర్ ఫీడర్ల పరిధుల్లోని పలు కాలనీల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.



మేయర్ గద్వాల విజయలక్ష్మికి మొక్కను అందజేస్తున్న సంఘం సభ్యులు

మేయర్‌ను కలిసిన యూసీడీ సంఘం సభ్యులు

నిజాంపేట్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): యూసీడీ విభాగంలో పనిచేస్తున్న కమ్యూనిటీ ఆర్గనైజర్లకు జూనియర్ అసిస్టెంట్ పే-స్కేల్ వర్తింపజేసేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. దీంతో ఆ సంఘం సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి, కమిషనర్‌కు గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆ సంఘం అధ్యక్షులు సాయికృష్ణ, సెక్రటరీ శ్రీకాంత్, ట్రెజరర్ సైదులు, మీడియా కో-ఆర్డినేటర్ మురళీ పాల్గొన్నారు.

హెచ్‌సీఏ స్కూల్ టోర్నీ విజేత



ట్రోఫీ ప్రదానం చేస్తున్న జగన్, వెంకటేష్ ప్రసాద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అండర్-16 ఇంటర్ స్కూల్ టోర్నమెంట్‌లో గౌతమ్ జూనియర్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్లో డీపీఎస్ టీమ్‌పై 62 పరుగుల తేడాతో గౌతమ్‌జట్టు నెగ్గింది. విజేత, రన్నరప్ జట్లకు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, టీమిండియా దిగ్గజ క్రికెటర్ వెంకటేష్ ప్రసాద్ ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ తమ కార్యవర్గం హెచ్‌సీఏ బాధ్యతలు తీసుకున్నాక రంజీ జట్టు ప్లేట్ నుంచి ఎలైట్ గ్రూప్‌కు అర్హత సాధించిందని, ఏడేళ్ల తర్వాత బుచ్చిబాబు ట్రోఫీ నెగ్గిందని చెప్పారు. ఈ ఏడాది సమ్మర్ క్యాంప్‌లు, ఇంటర్ డిస్ట్రిక్ టోర్నీ, ఉమెన్స్ లీగ్ నిర్వహించామని, ఏడాదంతా ప్లేయర్లను క్రికెట్ ఆడించేలా క్యాలెండర్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దేవ్‌రాజ్, కౌన్సిలర్ సునిల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సమావేశం

నల్లకుంట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మధుర (బృందావన్)లో జరుగుతాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, ఐఎఫ్‌డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యుడు మామిడి సోమయ్య, ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం తెలిపారు. గురువారం కౌన్సిల్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర ప్రతినిధులతోపాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ఆఫీస్ బేరర్లు, జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఆయా రాష్ట్రాల అనుబంధ జర్నలిస్టు యూనియన్‌ల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ న్యూస్‌పేపర్స్, న్యూస్ ఏజెన్సీస్ ఎంప్లాయీస్ యూనియన్‌ల సమావేశం కూడా జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యాచరణ రూపొందిస్తారన్నారు. నేషనల్ కౌన్సిల్ సభ్యుడు రామారావు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల ఆత్మహత్యలను నివారించండి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): పని లేకపోవడం వల్ల చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆరోపించింది. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది. గురువారం బర్కత్‌పురలో జరిగిన సమావేశంలో చేనేత కార్మిక సంఘం నేత బి.లక్ష్మీనర్సయ్య, వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.బాషా బత్తిని రాజేశం, ప్రధానకార్యదర్శి చేళ రాజేశ్వర్, కోశాధికారి గవ్వల శంకర్ మాట్లాడారు. చేనేత కార్మికుల సంక్షేమానికి పథకాలను ప్రవేశపెట్టి ఆత్మహత్యలను నివారించాలని కోరారు. చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

100 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడాలి

మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు బీజేపీ నాయకుల ఫిర్యాదు



మేడ్చల్ జిల్లా అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

దుండిగల్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): సర్వేనెంబర్ ఒక దగ్గర ఉంటే మరొక దగ్గర నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆక్రమణకు గురవుతున్న 4 ఎకరాలకు పైగా రూ.100 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని బీజేపీ నాయకులు ఆకుల సతీష్, పీసరి కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అరుణ్‌రావు, కుమార్‌గౌడ్, ఎల్లస్వామి మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పరిశీలించాలని అడిషనల్ కలెక్టర్, దుండిగల్ తహసీల్దార్‌కు ఫోన్‌లో కలెక్టర్ ఆదేశించారని బీజేపీ నాయకులు తెలిపారు.

ఆకృతి కన్‌స్ట్రక్షన్‌పై చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి మండలం, బాచుపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 453/1, 2లో ఆకృతి కన్‌స్ట్రక్షన్ వారు అప్రోచ్‌రోడ్డు కోసం ప్రభుత్వభూమి సర్వేనంబర్ 454ను చూపిస్తూ అక్రమ అనుమతులు పొందడమే కాకుండా 360 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు మేడ్చల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, వినతి పత్రం సమర్పించారు.



శిక్షణ పూర్తిచేస్తున్న వారికి సర్టిఫికెట్లను అందజేస్తున్న ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు నారాయణ, ప్రొ.సాయిలక్ష్మి

సీఆర్ ఫౌండేషన్ మహిళలు, సమాజ అభ్యున్నతికి కృషి

మియాపూర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్‌ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా సంక్షేమ కేంద్రం వృత్తివిద్యా కోర్సుల్లో ఉత్తీర్ణులైన యువతులకు సర్టిఫికెట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సీఆర్‌ఫౌండేషన్ గౌరవఅధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ, రామానంద తీర్థ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సాయిలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తిచేసుకున్న వారికి వారు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలను ఆయన ఖండించారు. చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితో మహిళలు సమాజ అభ్యున్నతికి కృషిచేయాలని కోరారు. ప్రొఫెసర్ సాయిలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి వృత్తుల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని, పూర్తివిశ్వాసంతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన, రామానంద తీర్థ ట్రైనింగ్ ఆఫీసర్ డాక్టర్ విహారి కృష్ణ, సీఆర్‌ఫౌండేషన్ హెల్త్‌డైరెక్టర్ కె.రజని, ఏఐటీయూసీ మాజీ కార్యదర్శి డాక్టర్ బీవీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన టీమ్‌తో డీసీపీ కోటిరెడ్డి, పోలీసులు

ప్రజలు పోలీసులతో ఫ్రెండ్లీగా మెలగాలి

మేడ్చల్ జిల్లా డీసీపీ కోటిరెడ్డి

దుండిగల్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ప్రజలు పోలీసులతో స్నేహపూర్వకంగా ఉంటూ ఒకరికొకరు సహకరించుకోవాలని మేడ్చల్ జిల్లా డీసీపీ కోటిరెడ్డి అన్నారు. సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి సూచన మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథులుగా డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. టోర్నమెంట్‌లో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్‌ఉద్యోగులు, విలేకర్లు, పలు కాలనీల క్రికెట్ ఆటగాళ్లు పాల్గొన్నారు. ఇందులో మొత్తం 14 జట్లు పాల్గొన్నాయి. బౌరంపేట ఇందిరమ్మకాలనీ టీమ్, గండిమైసమ్మ టీమ్ ఫైనల్‌లో తలపడ్డాయి. బౌరంపేట ఇందిరమ్మ కాలనీ టీమ్ ఫైనల్‌లో ట్రోఫీని గెలుచుకుంది. ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడంలో కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సహకరించారని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ సీఐ సతీష్, ఎస్ఐలు రామ్మోహన్‌రెడ్డి, శంకర్, డీఐ సతీష్, యువకులు పాల్గొన్నారు.

వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలి

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు : అడిషనల్ డీసీపీ



పీస్ కమిటీ సమావేశంలో మండప నిర్వాహకులు, ముస్లిం పెద్దలకు సూచనలు చేస్తున్న బాలానగర్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ

బాలానగర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రానున్న గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ వేడుకలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని బాలానగర్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ గణేశ్ మండపాల నిర్వాహకులకు, ముస్లిం పెద్దలకు సూచించారు. ఈ రెండు వేడుకలు ఒకే రోజు ఉండడంతో మండపాల నిర్వాహకులు, మసీదుల పెద్దలతో బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో పీస్‌కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. గణేశ్ నిమజ్జన సమయంలో డీజేసౌండ్లకు అనుమతి లేదని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలజడులు, మతవిద్వేషాలకు తావివ్వకుండా వేడుకలు నిర్వహించుకుని పోలీసులకు సహకరించాలని కోరారు. బాలానగర్ సీఐ నవీన్‌కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో బాలానగర్ ఏసీపీ హనుమంత్‌రావు, బాలానగర్ డీఐ నాగిరెడ్డి, ఎస్సైలు మాజీమియా, మక్బూల్ పాషా, రాంనారాయణ్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతిలేని సేంద్రియ ఎరువులను విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

జీడిమెట్ల, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా సేంద్రియ ఎరువులను విక్రయిస్తు వ్యక్తిని బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేసి జీడిమెట్ల పోలీసులకు అప్పగించారు. కుత్బుల్లాపూర్ మండలం అగ్రికల్చర్ అధికారి, క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలోని రామిరెడ్డినగర్ ప్లాట్ నెంబర్ 937లో సాదుసతీష్‌రెడ్డి అనేవ్యక్తి కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం, జీ2, జీ3 అనుమల్లేకుండా సేంద్రియ ఎరువులను నిల్వచేసి, ప్యాక్‌చేసి విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారంతో బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు, అగ్రికల్చర్ అధికారులు దాడులు నిర్వహించారు. భారీగా నిల్వచేసిన సేంద్రియ ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

కౌశిక్‌రెడ్డి మహిళలకు క్షమాపణలు చెప్పాలి

హైదర్‌నగర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మహిళలను అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో గెలిచి, ఇప్పుడు చీర, గాజులు చూపిస్తూ వారిని చులకన చేసి మాట్లాడిన పాడి కౌశిక్‌రెడ్డి మహిళలకు క్షమాపణలు చెప్పాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. నీచరాజకీయాలకు అడ్రస్‌గా మారిన కౌశిక్‌రెడ్డి లాంటి వారు సవాళ్లు విసిరితే చూస్తూ ఊరుకోబోమన్నారు. దేశంలోని అతిపెద్ద నియోజకవర్గం శేరిలింగంపల్లిలో ఎమ్మెల్యే గాంధీ ప్రజలందరి మన్ననలు పొందారని, మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మచ్చలేని నాయకుడుగా ఉన్నారని అన్నారు. సొంత నియోజకవర్గానికి ఏమీ చేయని, ప్రజల మద్దతులేని కౌశిక్‌రెడ్డికి మహిళలే బుద్ధి చెబుతారన్నారు.



మల్లికార్జునస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

భ్రమరాంబిక, మల్లికార్జున స్వామికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పూజలు

హైదర్‌నగర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరితో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భవనానికి అడ్డుగా ఉన్న చెట్లను నరికివేస్తున్న దృశ్యం

భవనానికి అడ్డుగా ఉన్నాయని చెట్ల నరికివేత

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నాటిన చెట్లను నిబంధనలకు విరుద్ధంగా ఓ భారీ బహుళ అంతస్తుల భవనం ఎదుట యాజమాన్యం నరికి వేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి దారిలోని భారీ భవనానికి అడ్డంగా, రోడ్డుకు పక్కన ఉన్న చెట్లను సగానికి గురువారం నరికివేశారు. వృక్షాలను రక్షిస్తే మనల్ని రక్షిస్తాయని పలువురు చెబుతుంటారు. కానీ అలాంటి 5 వృక్షాలను ఓ భారీ భవన నిర్మాణదారుడు దగ్గర ఉండి కొట్టి వేయించడంపై పర్యావరణ ప్రేమికులు, స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

విశ్వకర్మ కాలనీలో రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్న అధికారులు

గాజులరామారం, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్థావరంపై బాలానగర్ పౌరసరఫరా అధికారులు, సూరారం పోలీసులు సంయుక్తంగా దాడి చేసి70 క్వింటాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సూరారం గ్రామ విశ్వకర్మ కాలనీలో నివాసం ఉంటున్న అర్జున్‌పాండే ఇంట్లో రెండు వాహనాల్లో తీసుక వచ్చిన రేషన్ బియ్యాన్ని దిగుమతి చేసుకున్నట్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదుచేశారు. దీంతో ఆ ఇంటిపై దాడిచేసి, అక్రమంగా ఇంట్లో నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, జీడిమెట్లలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో భద్రపరిచారు. సివిల్‌సప్లై అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సూరారం పోలీసులు అతనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.